క్లుప్తంగా

పర్యావరణాన్ని పరిరక్షించాలి

• అసోసియేట్ డీన్ బాలసుబ్రమణియన్


గ్రామస్తులకు మొక్కల పంపిణీ

ముత్తుకూరు : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని ముత్తుకూరులోని మత్స్యకళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్ అన్నారు. తాళ్లపూడిలో తలపెట్టిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్‌లో భాగంగా బుధవారం సైన్స్ దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలో మొక్కలు నాటారు. గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేసి, సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డాక్టర్ మాధవన్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ, పర్యావరణ హితంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు త్రివేణి, శ్రీవిద్య పాల్గొన్నారు.

గజవాహనం బహూకరణ



పొదలకూరు : స్థానిక శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి గొడవర్తి అశోక్‌నాయుడు-సునీత దంపతులు స్వామివారికి రూ.2 లక్షల విలువైన గజవాహనాన్ని బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి, అమ్మవార్లకు గజవాహనం సమర్పించడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఉపాధ్యక్షుడు కోనం చినబ్రహ్మయ్య, సభ్యులు చొప్పా వెంకటేశ్వర్లు, దేవరం రఘురామిరెడ్డి, కృష్ణయ్యనాయుడు, కుంకు సురేష్, శ్రీనివాసులురెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



పొదలకూరు : పట్టణంలోని కాకాణి రమణారెడ్డి నగర్‌లో ఇటీవల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మృతి చెందగా అతని కుటుంబానికి కాకాణి గోవర్ధన్‌రెడ్డి యూత్ అసోసియేషన్ కార్యదర్శి అంజాద్ బుధవారం నగదు సాయం చేశారు. కార్యక్రమంలో వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

కనీవినీ ఎరుగని అభివృద్ధి


మండలంలోని అనికేపల్లి గ్రామం గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోవడం, రైతుల సమస్యలు పట్టించుకోకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర నిరాశ చెందారు. అయితే 2019 తరువాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అనికేపల్లి రూపురేఖలు మారిపోయాయి. దీంతో పాటు పంచాయతీ పరిధిలోని గొలగమూడి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందడంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు.

మారిన అనికేపల్లి రూపురేఖలు

• సమస్యల గ్రామంలో ప్రగతి పరుగులు
• సమకూరిన అన్నిరకాల వసతులు


అనికేపల్లి గ్రామ సచివాలయం


పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు



అనికేపల్లి గ్రామంలో..	
జరిగిన అభివృద్ధి పనులు	- 87
వెచ్చించిన నిధులు	- రూ.32.66 కోట్లు
డీబీటీ లబ్ధిదారులు	- 8,368 మంది
నాన్ డీబీటీ లబ్ధిదారులు	- 3,574 మంది
జరిగిన మొత్తం లబ్ధి	- రూ.45,61,10,608

వెంకటాచలం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అందులో భాగంగా అనికేపల్లి పంచాయతీకి నిధుల వరద పారించి, గతంలో ఎవరికీ సాధ్యంకాని రీతిలో పనులు పూర్తి చేయించారు. ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ అందిస్తుండడంతో గ్రామ ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు సంతోషంగా జీవిస్తున్నారు.

పంచాయతీ పరిధిలో..

➡ అనికేపల్లి పంచాయతీ పరిధిలో మొత్తం రూ.32.56 కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తి చేశారు.

➡ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ సెంటర్, గ్రంథాలయం, పాల శీతలీకరణ కేంద్రం, గ్రామంలో మట్టిరోడ్లు లేకుండా సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణాలు పూర్తి చేశారు.

➡ నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధి, జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికి తాగునీటి కుళాయి, జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన, స్వచ్ఛభారత మిషన్ కార్యక్రమంలో గ్రామంలో ఎక్కడా పారిశుద్ధ్య సమస్య లేకుండా చేశారు.

➡ వంద ఎకరాలకు సంబంధించిన రైతులకు విద్యుత్ సౌకర్యం లేక సాగునీటి కోసం అష్టకష్టాలు పడేవారు. ఈ సమస్యను మంత్రి కాకాణికి తెలియజేసిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ సౌకర్యం కల్పించి సాగునీటి కష్టాలు తీర్చారు.


➡ అనికేపల్లి గ్రామాల మధ్యలో మత్స్యకారులు చేపలు అమ్ముకునేందుకు రూ.25 లక్షలు వెచ్చించి చేపల మార్కెట్ నిర్మించడంతో మత్స్యకారులు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


గ్రామంలో నిర్మించిన సీసీరోడ్డు


అనికేపల్లి-గొలగమూడి మధ్య నిర్మించిన చేపల మార్కెట్

రైతుల దశాబ్దాల కల సాకారం

అనికేపల్లి గ్రామ ప్రజలు, రైతుల ఏళ్లనాటి కలను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సాకారం చేశారు. రైతులు తమ పొలాల్లోకి వెళ్లే మార్గంలో నక్కల కాలువపై బ్రిడ్జి లేకపోవడంతో రెండు కిలోమీటర్లు దూరం వెళ్లి అక్కడ నుంచి తమ పొలాల్లోకి వెళ్లాల్సి వచ్చేది. పొలంలోకి ఎరువుల బస్తాలు తీసుకెళ్లాలంటే రైతుల బాధలు వర్ణనాతీతం. అయితే ఈ సమస్యను రైతులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.2 కోట్లతో నక్కలకాలువపై బ్రిడ్జిని నిర్మించడంతో రైతులు సులభంగా పొలాల్లోకి వెళ్తున్నారు.


రూ.2 కోట్లతో నక్కల కాలువపై నిర్మించిన బ్రిడ్జి

ఎన్నడూ జరగని అభివృద్ధి



గ్రామ పంచాయతీలో ఎన్నడూ జరగని అభివృద్ధి పనులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసి చూపించారు. గ్రామంలో మట్టి రోడ్డు లేకుండా సిమెంటు రోడ్లు వేయించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో చాలా సంతోషంగా ఉన్నారు.

– రేణంగి సుమతి, ఎంపీటీసీ అనికేపల్లి

రుణపడి ఉంటాం



ఏళ్లనాటి రైతుల సమస్యకు మంత్రి కాకాణి ప్రత్యేక కృషితో పరిష్కారం లభించింది. నక్కలకాలువపై బ్రిడ్జి నిర్మించినందుకు గ్రామ రైతులంతా రుణపడి ఉంటారు. గ్రామంలో ప్రతి సమస్యను పరిష్కరించారు.

– పంటా జనార్ధన్‌రెడ్డి, అనికేపల్లి

గ్రామ స్వరూపం మార్చారు



అనికేపల్లిలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేయడంతో గ్రామ స్వరూపమే మారిపోయింది. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ ఒకేచోట నిర్మించడం గొప్ప విషయం. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు క్రమం తప్పకుండా అందిస్తున్నారు.

– తొలికొండ పెంచలయ్య, అనికేపల్లి

రూ.కోట్ల నిధులతో గ్రామాభివృద్ధి

అనికేపల్లి గ్రామంలో అభివృద్ధి పనుల కోసం రూ.కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. సీసీరోడ్లు, సైడు కాలువలు, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణాలు పూర్తి చేశారు.

– రాజశేఖర్, ఏఈ, పంచాయతీరాజ్

నేడు పూడిపర్తికి మంత్రి కాకాణి రాక

వెంకటాచలం : మండలంలోని పూడిపర్తి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు గ్రామానికి చేరుకుని శ్రీసీతా రామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఇందుకూరుపేట : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని కొమరిక గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొమరికకు చెందిన చిన్న బైక్‌పై రావూరు వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో కూడలి వద్ద ఎదురుగా వస్తున్న చేపల వ్యాన్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు గుర్తించి నెల్లూరుకు తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు.

ఆయుర్వేదంతో రోగాలు నయం

కోవూరు : ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని ఆయుర్వేదిక్ వైద్యుడు గంగాధర్ అన్నారు. కోవూరులోని ఆయుర్వేదిక్ వైద్యశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆయుర్వేదంలో అనేక దీర్ఘకాలిక రోగాలను నయం చేసే చికిత్స, మందులు ఉన్నాయన్నారు. కేన్సర్‌కు కూడా ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయని, పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

ఘన సన్మానం



కోవూరు : పొదుపు గ్రూపుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిన స్థానిక ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ కె.మధురిమను కోవూరు సంఘమిత్ర కార్యాలయంలో బుధవారం సన్మానించారు. సంఘమిత్ర ఏరియా కో-ఆర్డినేటర్ లలిత ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటస్వామి, సంఘమిత్ర అధ్యక్షురాలు సుగుణమ్మ, కార్యదర్శి ధనమ్మ, వెలుగు సీసీలు రామ్‌బాబు, వసంత, సారీ, పద్మ తదితరులు ఉన్నారు.

సోమిరెడ్డి పతనం తప్పదు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముత్తుకూరు : దళితులపై దాడి చేయించిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి పతనం తప్పదని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. ఎంపీపీ గండవరం సుగుణ, మండల సచివాలయ కన్వీనర్ నెల్లూరు శివప్రసాద్, దళిత నాయకులు తుమ్మతాటి రాజా, పాముల శ్రీనివాసులు, ఉపసర్పంచ్‌లు రాగాల వెంకటేశ్వర్లు, గోపాల్ తదితరులు స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మనుబోలు మండలం కట్టువపల్లి పర్యటనలో సోమిరెడ్డిని ప్రశ్నించినందుకు దళితుడైన వెంకటయ్యపై దాడి చేయించారని మండిపడ్డారు. ఇలాంటి చర్యల వల్ల టీడీపీ నేత చంద్రబాబు ప్రజలకు దూరమయ్యారన్నారు. నాలుగుసార్లు ఓటమిపాలైన సోమిరెడ్డికి రాబోయే ఎన్నికల్లో కూడా పరాజయం తప్పదన్నారు.

నీచ రాజకీయాలు మానుకోవాలి

• వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటశేషయ్య


మాట్లాడుతున్న మందల వెంకటశేషయ్య

వెంకటాచలం : గ్రామాల మధ్య చిచ్చు పెట్టించే సోమిరెడ్డి.. ఇకనైనా నీచ రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య హితవు పలికారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మనుబోలు మండలం కట్టువపల్లిలో దళితుడైన వెంకటయ్యపై సోమిరెడ్డి దాడి చేయించిన విషయం గ్రామస్తులందరికీ తెలుసన్నారు. అయితే దీనిని కప్పిపుచ్చుకునేందుకు వెంకటయ్య తనపై హత్యాయత్నం చేశాడని సోమిరెడ్డి చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. అభివృద్ధిని పట్టించుకోకపోవడం వల్లే సోమిరెడ్డి నాలుగు దఫాలు ఓటమి పాలయ్యాడని, ఈ దఫా ఎన్నికల్లో గెలుపు కోసం గ్రామాల్లో వివాదాలు సృష్టిస్తున్నాడని ధ్వజమెత్తారు. సోమిరెడ్డి లాంటి అవినీతిపరుడిని ప్రజలు నమ్మరన్నారు. సమావేశంలో నాయకులు చీకుర్తి నరసయ్య, తాటిపర్తి సురేష్, షాబాషా పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

మనుబోలు : మండలంలోని కట్టువపల్లి సమీపంలో కోడి పందేల స్థావరాలపై పోలీసులు మంగళవారం రాత్రి మెరుపు దాడులు చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ.4,100 నగదు, రెండు కోళ్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడుల్లో కానిస్టేబుళ్లు మాధవ్, రమేష్, రబ్బాని, ముధు, నరేష్, ఇస్మాయిల్, హోమ్‌గార్డులు ఆదిశేషయ్య, బాలాజీ పాల్గొన్నారు.

ఊసపల్లిలో ఎన్నికల ప్రచారం



పొదలకూరు : మండలంలోని ఊసపల్లిలో వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం కాకాణిని గెలిపించేందుకు మేము సిద్ధం అంటూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నేత, విశ్రాంత ఉపాధ్యాయుడు కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే స్టార్ క్యాంపెయినర్లుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.మాల్యాద్రి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవ ప్రగతికి సైన్సే పునాది

• ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

మనుబోలు : మానవ ప్రగతికి సైన్సే పునాది అని, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు సైన్స్‌ఫెయిర్‌లు ఉపయోగపడుతాయని హెచ్‌ఎంలు డేవిడ్, రాధాకృష్ణ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మనుబోలు, మడమనూరు, అక్కంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సైన్స్‌ఫెయిర్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. పేరెంట్స్ కమిటీ కో-ఆప్షన్ మెంబర్ అనమాల ప్రభాకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు ప్రమీల, మల్లికార్జున, రఫీ, బలరామయ్య, మురళీధర్‌రెడ్డి, కోటేశ్వరరావు, కామేశ్వరి, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

➡ వెంకటాచలం: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు 38 ప్రాజెక్టులను ప్రదర్శించారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు హెచ్‌ఎం చలపతి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రమణరాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

➡ పొదలకూరు : మండలంలోని మహ్మదాపురంలో ఉన్న డీఎస్సార్ జెడ్పీహైస్కూల్లో సైన్స్ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల సీనియర్ డాక్టర్ ఎంవీ రమణయ్య, ఎంఈఓ శోభనాద్రి కలిసి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ స్టాల్స్‌ను తిలకించి నేటి విద్యార్థులు భవిష్యత్తు విజ్ఞాన ఆవిష్కర్తలని పేర్కొన్నారు. హెచ్‌ఎం పి.రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు సులోచన, కరుణకుమారి, సుబ్బానాయుడు, శైలజ పాల్గొన్నారు.

➡ ముత్తుకూరు : మండలంలోని సుబ్బారెడ్డి పాళెం యూపీ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. భౌతిక శాస్త్రానికి సంబంధించి విద్యార్థులు 20 నమూనాలను తయారు చేసి, ప్రదర్శించారు. వీటిల్లో ఏటీఎం, సేవ్ ఫారెస్ట్, సేవ్ నేచర్ తదతర నమూనాలు బహుమతులు గెలుపొందాయి. ఈ సందర్భంగా సైన్స్ టీచర్ ఎ.రమను హెచ్‌ఎం సుబ్బరత్నమ్మ, ఉపాధ్యాయులు జనార్ధన్, పద్మారత్నం, సాయి, అహ్మద్ ఘనంగా సత్కరించారు.

➡ తోటపల్లిగూడూరు : మండలంలోని చెన్నపల్లి పాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. హెచ్‌ఎం సాయిప్రసాద్, ఉపాధ్యాయులు ఫణికుమార్, సులోచనమ్మ, పద్మజ, విద్యాధరి పాల్గొన్నారు.

➡ సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ చెరుకూరు సరళ కుమారి మాట్లాడుతూ సమాజాభివృద్ధికి సైన్స్ అత్యంత కీలకమన్నారు. ఎంఈఓ-2 జయరామ నాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ స్వాతి, వైస్ చైర్మన్ గిరిజాకుమారి, హెచ్‌ఎం అహ్మద్‌బాషా పాల్గొన్నారు.

➡ కోవూరు : నోబెల్ బహుమతి గ్రహీత మేడమ్ క్యూరీని విద్యార్థినులు ఆదర్శంగా తీసుకుని శాస్త్రవేత్తలుగా తయారు చేయాలని పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కోవూరులోని జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తి, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

➡ బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని డీఎల్ఎన్నార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రయోగాలను ప్రదర్శించి వాటి ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాధవరావు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు చేయడం ద్వారా చాలా విషయాలు నేర్చుకుంటారన్నారు.


మనుబోలు: హైవేపై ప్రమాదాల నివారణకు సంబంధించిన ప్రయోగాన్ని ప్రదర్శిస్తున్న అక్కంపేట విద్యార్థులు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వాటర్ ప్యూరిఫికేషన్ గురించి వివరిస్తున్న విద్యార్థులు


మనుబోలు : ప్రయోగాల నమూనాలను పరిశీలిస్తున్న హెచ్‌ఎం రాధాకృష్ణ


మనుబోలు : సీవీ రామన్‌కు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం డేవిడ్, ఉపాధ్యాయులు


కోవూరు : విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు


వెంకటాచలం: విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న హెచ్‌ఎంలు


పొదలకూరు : సైన్స్ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న టీచర్లు


ముత్తుకూరు : సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్‌లో..


తోటపల్లిగూడూరు : చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలలో..